క్లుప్తంగా

సీఎంకు క్షమాపణ చెప్పాలి

మహబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించాడు. వెంటనే సీఎంకు క్షమాపణ చెప్పాలన్నారు. కౌశిక్ రెడ్డి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశాడు.

కరపత్రాల ఆవిష్కరణ

నెల్లికుదురు: మహోత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొరలపై హిందూ ముస్లింలు కలిసి తిరగబడ్డారని, మతాల మధ్య కొట్లాటకాదని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న అన్నారు. ఈనెల 18వరకు నిర్వహించే రైతాంగ పోరాట విజయాలను తెలిపే కరపత్రాలను సోమవారం మండలంలోని మేచరాజుపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాకయ్య, కేశవులు, వెంకన్న, రవి, సైదులు పాల్గొన్నారు.

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

దంతాలపల్లి: మండలం కుమ్మరికుంట్ల గ్రామంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన బొల్లం రమేష్ వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. ఆదే గ్రామానికి చెందిన ఏరుకొండ విగ్నేష్ బైక్‌పై వస్తున్నాడు. రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం తొర్రూరులో ఆస్పత్రికి తరలించారు. బొల్లం రమేష్ అపస్మారక స్థితికి వెళ్లడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. రమేష్ తండ్రి ఇద్దయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిల్లల రాజు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరికి..

గార్ల: ఆటో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన తిర్లాపురం గ్రామ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. గార్ల మండలం తిర్లాపురం గ్రామానికి చెందిన జర్పుల మాన్‌సింగ్ కూలీ పనికి వెళ్లి వస్తుండగా తిర్లాపురం గ్రామ సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని ఆటో ఢీకొట్టడంతో తలకు, కాళ్లు చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన దాసరివెంకన్న సోమవారం మేకలను ఊరి బయటకు తీసుకెళ్లాడు. అందులో ఒక మేక మేత మేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌వైర్‌కు తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.10వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

బెల్లం నిల్వలు సీజ్



నెల్లికుదురు: అక్రమంగా నిల్వ చేసిన బెల్లం, పటికను పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మతండాలో అక్రమంగా బెల్లం నిల్వలు ఉన్నట్లు సమాచారం మేరకు పోలీసు సిబ్బందితో వెళ్లి తండాలో సోదాలు నిర్వహించగా తండాకు చెందిన ధరంసోత్ కృష్ణ, బానోతు వెంకట్ ఇళ్లల్లో 7క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటికను గుర్తించినట్లు తెలిపారు. బెల్లం బస్తాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీజే సీజ్

గూడూరు: ప్రజలకు ఇబ్బంది కల్గిస్తూ, ప్రాణాలకు ముప్పు తెచ్చే డీజే ఉపయోగిస్తే ఇక నుంచి ఉపేక్షించేది లేదని సీఐ కె.బాబురావు హెచ్చరించారు. మండలంలోని బొద్దుగొండలో సోమవారం వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా డీజే సిస్టమ్‌తో గణపతిని ఊరేగిస్తుండగా, డీజే బాక్స్‌లను సీజ్ చేశారు.

ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం

గూడూరు: భగవంతుడి నామస్మరణతో మానవ జీవితానికి సార్థకత లభిస్తుందని, ప్రతీ ఒక్కరు సన్మార్గంలో సేవా భావాన్ని కలిగి ఉండాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడు కృష్ణవేణి అన్నారు. మండలంలోని బొద్దుగొండలో సోమవారం త్రైతసిద్ధాంతం భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు రజిత, లలిత, వీరస్వామి, వంశీకృష్ణ, ఈశ్వర్, కృష్ణ, సుజాత, కాలయుక్తి, రేఖ పాల్గొన్నారు.

గణనాథుల నిమజ్జనం



మానుకోటలో నిజాం చెరువులో వినాయకుడి నిమజ్జనం

జిల్లా వ్యాప్తంగా సోమవారం గణనాథుల విగ్రహాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో భక్తులు, మండపాల నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, మేళతాళాల నడుమ ట్రాక్టర్లపై వినాయక విగ్రహాలను ఊరేగించారు. అనంతరం విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చెరువుల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. - సాక్షి నెట్‌వర్క్



డోర్నకల్: పెద్దచెరువులో గణేశుడి నిమజ్జనం



కేసముద్రం: గణేశుడి నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు



మరిపెడ రామాలయంలో..



నర్సింహులపేట: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



మానుకోటలో ట్రాక్టర్లలో గణనాథుల ఊరేగింపు



మానుకోటలో మట్టి గణపతితో భక్తురాలు



నెల్లికుదురు: గణపతి విగ్రహంతో చిన్నారి



మానుకోట: తలపై విగ్రహం తీసుకెళ్తున్న భక్తుడు



గార్ల: పాకాల ఏటిలో గణనాథుడిని నిమజ్జనం



గూడూరు: వినాయకుడి ఊరేగింపులో మంగళహారతులు ఇస్తున్న మహిళలు



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం పంతులు తండాలో ..



మానుకోటలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కేసముద్రం: గణనాథుడిని ఊరేగింపుగా తీసుకెళ్తున్న నిర్వాహకులు



మహబూబాబాద్ అర్బన్: ఊరేగింపులో కోలాటం ఆడుతున్న మహిళలు



కురవి: నిమజ్జనం చేస్తున్న భక్తులు



దంతాలపల్లి: బీరిశెట్టిగూడెం గ్రామంలో..



నెల్లికుదురు: ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలో..



మహబూబాబాద్ అర్బన్: వేలంపాటలో లడ్డూను రూ.72,116లకు దక్కించుకున్న భక్తుడు కందుకూరు శశిధర్



మహబూబాబాద్ రూరల్: గోమయ గణపతి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్ దంపతులు



బయ్యారంలో నిమజ్జన శోభాయాత్ర

ఉద్యమకారులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

మహబూబాబాద్: తెలంగాణ ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలంతోపాటు రూ.25వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.శ్రీనివాస్ ఫోరం మానుకోట పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణసింగ్ డిమాండ్ చేశాడు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య యాత్ర సోమవారం మానుకోటకు చేరుకుంది. కాగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను విస్మరించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం కోసమే చైతన్య యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈనెల 27న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగే ఫోరం ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జ్యోతిరెడ్డి, జానకిరెడ్డి, సురేందర్, శ్యామల, గగన్‌కుమార్, జనగన్, దయానంద్, రాములు, ఖయ్యూం, గంగుల శ్రీనివాస్, హన్మంతు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఘనంగా 'మిలాద్-ఉన్-నబీ'



డోర్నకల్‌లో ముస్లింల ర్యాలీ



మహబూబాబాద్ రూరల్: వినాయక నిమజ్జనంలో మిఠాయి పంపిణీ చేస్తున్న ఫరీద్

మహబూబాబాద్ రూరల్: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి కొలువై ఉన్న హజ్రత్ సయ్యద్ ఇమామ్ షావలీ దర్గాలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ ఫరీద్ ఆధ్వర్యంలో మత సామరస్యానికి, శాంతికి చిహ్నంగా వినాయక నిమజ్జన కార్యక్రమంలో భక్తులకు మిఠాయి పంపిణీ చేశారు.

డోర్నకల్: మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకుని సోమవారం డోర్నకల్‌లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐ బి.రాజేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండా జీపీ పరిధిలోని హర్యతండాకు చెందిన భూక్య హతిరామ్ అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు సోమవారం విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

రూ.2వేల ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్‌లో పనిచేసే ఉపాధ్యాయుడు మురళీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు చిన్ననాగారం గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు 50కేజీల బియ్యం, రూ.2వేలను సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వెంకన్న, యాకుబ్, యాకయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో వరద బాధిత అంగన్‌వాడీ టీచర్లకు సీఐటీయూ మండల కన్వీనర్ దుండి వీరన్న ఆధ్వర్యంలో నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు అల్వాల వీరయ్య, ఉప్పలయ్య, పుష్ప, ముత్తయ్య పాల్గొన్నారు. మండలంలోని ఉల్లెపల్లి, సీతారాంతండా, బాల్నిధర్మారం వరద బాధిత కుటుంబాలకు హైదరాబాద్‌కు చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఇన్ఫోసిస్ సహకారంతో సోమవారం నిత్యావసర సరుకులు అందజేశారు.

పత్రాల అందజేత

నర్సింహులపేట: ప్రభుత్వం చేపట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు నర్సింహులపేటలో సోమవారం ధ్రువీకరణ పత్రాలను మండల ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్ పంపిణీ చేశారు. మహాలక్ష్మి పథకంలో గ్యాస్ సబ్సిడీలో రూ.500లకే అందించడానికి లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ కిన్నెర యాకయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సన్మానం

కురవి: ఆసరాలేని అనాథలకు అండగా నిలుస్తూ చేయూతనందిస్తున్న గంగరబోయిన రఘు అభినందనీయుడని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కురవి సీపీఐ కార్యాలయంలో రఘును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, సమ్మయ్య, రమేష్, పాల్గొన్నారు.

'కమ్యూనిస్టులే నిజమైన వారసులు'

గార్ల: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగాలు చేసిన కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట నిజమైన వారసులు అని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాధుల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాటాల వారోత్సవ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం తెలంగాణ సాయుధ పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, కవిత, హరి, ఎల్లయ్య, వీరస్వామి, ఈశ్వర్‌లింగం, రాజారావు, పెద్దవెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజావ్యతిరేక పాలకులపై ఉద్యమించాలి

గూడూరు: ప్రజావ్యతిరేక విధానాలతో సంక్షేమాన్ని విస్మరిస్తూ, మాటల గారడీ చేస్తున్న పాలకులపై ఉద్యమించాలని ఎంసీపీఐ (యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్, కటకం బుచ్చిరాములు, వీరస్వామి పాల్గొన్నారు.

పాముకాటుతో తీవ్ర అస్వస్థత

నెహ్రూసెంటర్: గూడూరు మండలంలోని నెలవంచ గ్రామానికి చెందిన ప్రవీణ్ రక్తపింజర అనే పాము కాటుకు గురికాగా ఈనెల 2వ తేదీన జిల్లా కేంద్రంలోని ధరణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేరాడు. రోగి ప్రవీణ్ పరిస్థితి క్రిటికల్‌గా ఉండడంతో ధరణి ఆస్పత్రి వైద్యులు ప్లాస్మాథెరఫీ ద్వారా రోగికి చికిత్స అందజేసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా ప్లాస్మాథెరఫీ సేవలను అందించేది ధరణి ఆస్పత్రి మాత్రమే అని డాక్టర్ దీప్తి తెలిపారు.

పరామర్శ..

పెద్దవంగర: కార్యకర్తల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని ఎవరూ అధైర్య పడొద్దు అండగా ఉంటానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్యాల గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొగులగాని రజనీకాంత్ తండ్రి వెంకటసోములు ఇటీవల మృతి చెందాడు. అలాగే ఇటీవల తన్నీరు మన్విత్ శకుంతల్ (3) నీటిసంపులో పడి మృతి చెందాడు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

పడిపోతేనే పట్టించుకుంటారా..!



పెద్దవంగరలో పాకురు పట్టిన కల్వర్టుపై వెళ్తున్న వాహనాలు

పెద్దవంగర: భారీవర్షాలకు ఎగువన ఉన్న చెరువు అలుగు పారితే రోడ్డుపై ఉన్న కల్వర్టు మీదుగా వరద ఉప్పొంగి ప్రవహిస్తే గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. వరద ఉధృతి తగ్గితే కల్వర్టుపై నిత్యం నీరు పారి పాకురు పడుతోంది. దీంతో ద్విచక్రవాహదారులు జారీ కిందపడి పడుతున్నారు. పెద్దవంగర ఎక్స్‌రోడ్డు నుంచి పాలకుర్తి, ఉప్పరగూడెం, పెద్దవంగర గ్రామాలకు పోవాలంటే కల్వర్టు మీదుగా వెళ్లాల్సిందే. కల్వర్టుపై మీదుగా వెళ్లే ద్విచక్రవాహనాలు పాకురుతో అదుపుతప్పి పడిపోతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కల్వర్టుపై బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.